


'కూటమి'కి క్యూ

- వైసీపీని వీడుతున్న ప్రజాప్రతినిధులు
- చిత్తూరులో 18 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరిక
- గతంలో నలుగురు జనసేనలోకి
- పుంగనూరులో పార్టీకి 11 మంది కౌన్సిలర్ల రాజీనామా
- పార్టీ మారేందుకు సిద్ధమవుతున్న పలువురు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు
- కొందరికి గేట్లు మూసేసిన అధికార పార్టీ నేతలు



'కూటమి'లో చేరేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు క్యూ కడుతున్నారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో కూటమి అధికారంలోకి వచ్చింది. జిల్లాలో పుంగనూరు మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ భారీ విజయం సాధించింది. ఈ క్రమంలో వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు టీడీపీ కూటమిలో చేరేందుకు క్యూ కడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అవసరాన్ని బట్టి చేర్చుకుంటున్నారు. మరికొన్నిచోట్ల గేట్లు మూసేశారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పుంగనూరులో మొదలు

పుంగనూరులో మున్సిపల్ ఛైర్మన్ అలీమ్‌బాషాతో కలిపి 11 మంది కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేశారు. త్వరలో టీడీపీలో చేరేందుకు ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా బాబు ఇంట్లో చర్చించారు. మరికొందరు కూడా టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది.ఈ మున్సిపాలిటీలో మొత్తం 31వార్డులనూ వైసీపీ దౌర్జన్యంగా ఏకగ్రీవం చేసుకుంది. ఇక, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఉంటారు. ఈ క్రమంలో ఇక్కడ టీడీపీకి ఆధిక్యం లభించాలంటే 17మంది అవసరం. ఇప్పటికే 11 మంది వైసీపీకి రాజీనామా చేసి సిద్ధంగా ఉండగా.. మరో 9మంది టీడీపీలో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. రొంపిచెర్ల మండలంలోనూ పలువురు పంచాయతీ వార్డు సభ్యులు కూడా వైసీపీకి రాజీనామా చేశారు.

చిత్తూరులో మేయరు సహా చేరిక

చిత్తూరులో శుక్రవారం మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి సహా 18 మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఇక్కడ గతంలోనే నలుగురు జనసేనలో చేరిపోయారు.

కుప్పంలో గేట్లు క్లోజ్

సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇక్కడ మున్సిపల్ కౌన్సిలర్లు సహా మండలాల్లోని పలువురు ప్రజాప్రతినిధులు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ.. 'కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన వారినే గుర్తించండి. బయటి నుంచి కొత్తగా ఎవరినీ రానివ్వద్దు. వారంతా అవసరం లేదు' అని సీఎం చంద్రబాబు ఇటీవల పార్టీ నాయకులకు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఇక్కడ పార్టీ మారడాలకు బ్రేక్ పడింది.

పలమనేరులో జోరుగా ప్రయత్నాలు

పలమనేరు మున్సిపాలిటీలో 26 మంది కౌన్సిలర్లు ఉండగా.. వారిలో ఇద్దరు టీడీపీకి చెందినవారు. మిగిలిన 24 మందిలో సగం మంది పార్టీ మారేందుకు టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ మారే వారిపట్ల ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. టీడీపీ కోసం పనిచేసిన వారు నొచ్చుకోకుండా జాగ్రత్తగా తీసుకోవాలని భావిస్తున్నారు.

● పూతలపట్టు, నగరి, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో ప్రస్తుతానికి చేరికలు లేకపోయినా.. సమీప భవిష్యత్తులో టీడీపీలో చేరేవారి సంఖ్య పెరగనుంది.

మండలాల్లోనూ అదే దారి

మండలాల్లోనూ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పార్టీ మారడంపై దృష్టి పెట్టారు. పలుచోట్ల అధికార పార్టీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. తిరుపతి జిల్లాలో అయితే ఎన్నికల ముందే నారాయణవనం జడ్పీటీసీ సుమన్, నింద్ర మల్లీశ్వరి, వడమాలపేట మురళీధర్‌రెడ్డి, ఏర్పేడు తిరుమలయ్య, శ్రీకాళహస్తి వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు అర్చనాదేవీ టీడీపీలో చేరారు. ఇటీవల చిత్తూరులో జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి వీరిలో కొందరు పసుపు కండువాలతో హాజరు కావడం గమనార్హం. ఇక, చిత్తూరు జిల్లాలో మున్సిపాలిటీల తర్వాత మండల పరిషత్తుల నుంచి చేరికలు ఉంటాయని భావిస్తున్నారు.

పాత నాయకులను విస్మరించకుండా..

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో తమ పనులు చక్కబెట్టుకోవడానికి పార్టీ మారే వారి సంఖ్య ఇక పెరుగుతూ ఉంటుంది. కూటమి నాయకులు కూడా వారి అవసరాలకు అనుగుణంగా పార్టీలో చేర్చుకుంటారు. ఈ క్రమంలో ఐదేళ్ల పాటు పార్టీ జెండా మోసిన అసలు టీడీపీ శ్రేణులను విస్మరించకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వంలో పదవులు, పెత్తనం అనుభవించిన వారంతా.. ఇప్పుడు ఇక్కడా పెత్తనం చెలాయించే అవకాశాలున్నాయి. ఇలా జరిగితే ఐదేళ్ల పాటు కష్ట నష్టాలకు ఓర్చిన టీడీపీలోని పాత నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంది. కూటమికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు పాత వారిని విస్మరించకుండా తగిన ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉంది.

- చేరికలతో 25కి పెరిగిన కూటమి బలం
- ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్యేలు
- కౌన్సిల్‌లో స్పష్టమైన మెజారిటీ

టీడీపీ ఖాతాలోకి కార్పొరేషన్

చిత్తూరు సిటీ, జూలై 5: చిత్తూరు నగర పాలక సంస్థ కూటమి ఖాతాలో చేరింది. శుక్రవారం నాటి చేరికలతో కౌన్సిల్‌లో కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించింది. వీరిలో మేయరు అముద, డిప్యూటీ మేయరు రాజేష్‌కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. వైసీపీలో వర్గవిభేదాలు, అసంతృప్తులతో పాటు అధికార పార్టీలో ఉంటే అభివృద్ధి జరుగుతుందన్న భావనతో పలువురు పార్టీ మారారు. నగరంలోని బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో 50 డివిజన్లు ఉండగా.. అప్పట్లో 37 చోట్ల వైసీపీ దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకుంది. మిగిలిన వాటికి ఎన్నికలు జరగ్గా.. 3 చోట్ల టీడీపీ గెలిచింది. తాజాగా మేయర్, డిప్యూటీ మేయర్ సహా 18 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో వీరి బలం 21కి పెరిగింది. కొన్నాళ్ల కిందట నలుగురు జనసేనలో చేరారు. దీంతో కౌన్సిల్‌లో కూటమికి 25 మంది సభ్యులయ్యారు. వీరికి తోడు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా చేరడంతో ఆ సంఖ్య 27కి చేరింది. ఇంకా కొందరు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా, చేరికల సందర్భంగా ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, నగర అభివృద్ధి కోసం మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లు టీడీపీలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు వసంత్ కుమార్, ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, అశోక్, కంద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే గురజాల

ఆదర్శంగా నగరంగా తీర్చిదిద్దుతాం

అందరి సహకారంతో చిత్తూరును అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని మేయరు అముద తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వేలూరు, తిరుపతికి దీటుగా చిత్తూరును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీనికోసం ఎమ్మెల్యే వద్ద మాస్టర్ ప్లాన్ ఉందన్నారు.

టీడీపీలో చేరిన కార్పొరేటర్లు వీరే

మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఎస్.రాజేష్ కుమార్ రెడ్డి, డివిజన్ల వారీగా కార్పొరేటర్లు.. పి.నవీన్ కుమార్(2వ) బి.అజర్ భాను (6వ), డి.కె.సుమతి (10వ), ఎం.శాంతి (18వ), పి.గంగ (22వ),ఇ.ఇందు (27వ), టి.ప్రభావతి (28వ), ఎస్.సుష్మ (30వ), సయ్యద్ సర్దార్ (31వ), ఎస్.ఉన్నికృష్ణ (38వ), పి.గణేష్, (40వ), కుప్పమ్మ (41వ), ఆర్.శశికుమార్ (42వ), పి.వెంకటరమణ (43వ), ఎస్.రెడ్డెప్ప (46వ), ఏజీ సహదేవన్ (50వ డివిజన్).

22 మంది కార్పొరేటర్ల సస్పెన్షన్

చిత్తూరు: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ 22 మంది కార్పొరేటర్లు, ఇద్దరు కో- ఆప్షన్ సభ్యులను సస్పెండు చేస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు భరత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు కొంత మంది కార్పొరేటర్లు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా ఎన్నికల సమయంలో చర్యలు తీసుకోకూడదని పార్టీ నిర్ణయించింది. దీంతో పాటు మేయరు, డిప్యూటీ మేయరు సమా 18 మంది కార్పొరేటర్లు శుక్రవారం టీడీపీలో చేరిపోయారు. గతంలో నలుగురు జనసేనలో చేరిన విషయం తెలిసిందే.



శ్మశానం వద్ద కాల్చివేసిన ప్రభుత్వ ఫైళ్లు

ప్రభుత్వ ఫైళ్ల దహనం..!

● పుంగనూరు ఎంపీడీవో కార్యాలయ రికార్డులుగా అనుమానం

పుంగనూరు, జూలై 5: పుంగనూరు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా శ్మశానం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ప్రభుత్వ రికార్డులు దహనమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయానికి చెందిన రికార్డులను సంచిలో వేసుకొని రహస్యంగా కాల్చి బూడిదచేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన రికార్డులు చేరిపేయాలనే ఈ చర్యకు పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.వైసీపీ పాలనలో ఏదైనా అవినీతి, అక్రమాలు జరిగిఉంటే టీడీపీ ప్రభుత్వంలో వెలికితీస్తారనే భయంతో ఉపాధిహామీ ఇతరశాఖల రికార్డులు కాల్చివేశారా అనే ప్రచారమూ జరుగుతోంది.

రైతులకు ఉచితంగా కోడెలు, దూడలు

ఐరాల(కాణిపాకం), జూలై 5: కాణిపాక వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలోని గోశాల నుంచి అవసరమైన రైతులకు కోడెలు, కోడెదూడలను ఉచితంగా ఇస్తామని ఈవో వెంకటేశు శుక్రవారం తెలిపారు. వ్యవసాయ భూమి కలిగి, హిందూ మతానికి చెందిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, స్థానికత తెలియజేసే వీఆర్వో సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, రూ.100 విలువ గల నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్‌ను జత చేసి ఆలయ కార్యాలయ భవనంలో పనివేళల్లో అందించాలని కోరారు. మరిన్ని వివరాలకు 08573-281747, 79932 75887, 99636 63518 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కృత్రిమకాలుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, జూలై 5: ఆధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలు అవసరమైన వారు 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకుడు శ్రీనివాస్ కోరారు. దరఖాస్తుదారులకు ఈనెల 26వ తేది తపోవనంలో క్యాంపు నిర్వహిస్తామన్నారు. కొలతలు తీసుకుని రూ.51వేల విలువ కలిగిన కృత్రిమ కాలును ఉచితంగా అందిస్తామని వివరించారు. ఆధార్, రేషన్‌కార్డులు, సదరం మెడికల్ సర్టిఫికెట్, వికలత్వం కనిపించేలా ధంగా రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. అవసరమైన వారు కలెక్టరేట్ భవన సముదాయం, అంబేడ్కర్ భవన్, చిత్తూరు అనే చిరునామాలోను.. ఇతర వివరాలకు 94403 57522 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

రెస్కో ‘అక్రమ’ ఉద్యోగులకు పోల్ టెస్ట్!

ఇతర పరీక్షలు కూడా ● అనర్హులుగా అత్యధికులు ● అక్రమ పదోన్నతి ఎండీనే పరీక్షాధికారి

కుప్పం, జూలై 5: కుప్పం విద్యుత్తు గ్రామీణ సంస్థ (రెస్కో)లో అక్రమ నియామకాలు నియోజకవర్గంలో చర్చనీయాంశమయ్యాయి. వైసీపీ హయాంలోని పాలకులు, అధికారుల అవినీతి చర్యల మూలంగా పొందిన ఈ ఉద్యోగాలు ఉంటాయో ఊడతాయో తెలియక లక్షలు సమర్పించుకున్న ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. రెస్కోలో అసిస్టెంట్ హెల్పర్లుగా అక్రమంగా చేరిన 104 మందికి శాంతిపురం రెస్కో కార్యాలయం ఆవరణలో శుక్రవారం పోల్ టెస్ట్‌తోపాటు, ఇతర నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. అధికారులు స్పష్టంగా చెప్పడంలేదు కానీ, ఈ పరీక్షల్లో సుమారు 60 మందికి పైగా అనర్హులుగా తేలినట్లు తెలిసింది. కుప్పం రెస్కోలో దాదాపు ఆరేడు నెలల క్రితం 122 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. వీరిలో 109 మందిని అసిస్టెంట్ హెల్పర్లుగా నియమించుకున్నారు. మిగిలిన వారికి వివిధ విభాగాల్లో ఉద్యోగాలు ఇచ్చారు. దీనికి నాటి పాలకులకు, అధికారులకు లక్షల్లో ముడుపులు ముట్టాయన్నది బహిరంగ రహస్యమైపోయింది. టీడీపీ అధికారంలోకి రాగానే రెస్కోలో అక్రమాలపై టార్గెట్ చేసింది. జేసీ పి.శ్రీనివాసులు పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుంటూనే అక్రమ నియామకాలు, అవినీతి చర్యలపై విచారణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఆరు నెలల ముందు ఉద్యోగాలు పొందిన 122 మందిలో అసిస్టెంట్ హెల్పర్లుగా ఉన్న 109 మందిని పరీక్షలకు పిలవగా 104 మంది హాజరయ్యారు. పోల్ టెస్ట్ (స్తంభాలు ఎక్కడం)తోపాటు ఇతర నైపుణ్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఉదయంనుంచి సాయంత్రం దాకా పోల్ టెస్ట్‌తోనే సరిపోయింది. ఈ టెస్ట్‌కు హాజరైన వారిలో కొందరు పోల్ ఎక్కకుండానే ఇళ్లకు వెళ్లిపోగా, మరికొందరు పోల్ ఎక్కడంలో విఫలమై వెనుదిరిగారు. పోల్ టెస్ట్ అనంతరం రీడింగ్ తీయడం, మెటీరియల్ వేరుచేయడం, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ అటెండ్ కావడం వంటి ఇతర నైపుణ్య పరీక్షలను శాంతిపురం రెస్కో కార్యాలయంలోనే నిర్వహించారు. పొద్దుపోయే వరకూ ఈ పరీక్షలు సాగుతూనే ఉన్నాయి. ఎంతమంది అనర్హులుగా తేలారన్న ప్రశ్నకు అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, వారి ఆదేశాల ప్రకారమే చర్యలు ఉంటాయని చెప్పుకొచ్చారు. కానీ 60 మందికి పైగానే అనర్హులుగా తేలినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, ఈ టెస్టులకు ఆరు నెలల క్రితం నియామకమైనవారినే కాకుండా పదీ పదిహేనేళ్లనుంచీ రెస్కోలో కిందిస్థాయిలో చేరి, పదోన్నతిపై జూనియర్ అసిస్టెంట్లు, ఇతర పదోన్నతులు పొందిన మరికొంతమంది ఉద్యోగులనూ చేర్చడం విమర్శలకు తావిస్తోంది.

అక్రమ పదోన్నతి అధికారి పర్యవేక్షణలోనే పరీక్షలు

నిజానికి పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ పి.శ్రీనివాసులు పర్యవేక్షణలో పరీక్షలు జరగాలి. కానీ పదోన్నతి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రెస్కో ఎండీ ప్రభాకర్ పర్యవేక్షణలో మొత్తం ప్రక్రియ నడవడం కూడా విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం రెస్కో ఎండీ ప్రభాకర్ పదోన్నతి మీద ఆ స్థానం పొందారు. అంతకు ముందు ఎండీగా ఉన్న సుబ్రమణ్యం పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఆ స్థానంలో కొనసాగారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29న ఆయన పదవీ విరమణ చేశారు. దీనికి ఒకరోజు ముందు అంటే 28వ తేదీ రాత్రికి రాత్రి ఏడీఈగా ఉన్న ప్రభాకర్‌కు డీఈగా పదోన్నతి ఇచ్చారు. ఆ తర్వాత ఎండీగా పదోన్నతి కల్పించారు. ఇలా ఒక్క రోజే డబుల్ ప్రమోషన్ ఇచ్చారు. సీనియారిటీ ప్రకారం ఎండీ పోస్టుకు అర్హుడైన డీఈ మదన్ మోహన్‌ను ఎటువంటి నిబంధనలు పాటించకుండా రిలీవ్ చేసి గాలిలో ఉంచారు. ఆయనేమో దీనిపై కోర్టుకు వెళ్లి స్టే పొంది తిరిగి అదే డీఈ పదవిలో కొనసాగారు. ఇలా దొడ్డిదారిన ఎండీగా పదోన్నతి పొందిన ప్రభాకర్ పర్యవేక్షణలో, ఉద్యోగులకు అర్హత పరీక్షలు జరగడం విడ్డూరం. అంతేకాదు.. నాడు అక్రమ నియామకాలు జరగడంలో ప్రస్తుత ఎండీ కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.


శాంతిపురం రెస్కో కార్యాలయం ఆవరణలో స్తంభాలు ఎక్కుతున్న ఉద్యోగులు

అస్మదీయులకు ఉద్యోగాలు

ముడుపుల చెల్లింపులే కాదు.. వైసీపీ పాలకులకు, నేతలకు, కో ఆపరేటివ్ అధికారులకు, రెస్కో అధికారులకు చెందిన వారికీ అక్రమ నియామకాలలో చోటు లభించింది. అప్పటి కో ఆపరేటివ్ డీసీవో బ్రహ్మానందరెడ్డి కుమారుడు, ప్రస్తుత డీఎల్‌సీవో ఆనందన్ సోదరుని కుమారుడు, ఎండీ ప్రభాకర్ సోదరి కుమారుడు కూడా రెస్కోలో దొడ్డిదారిన ఉద్యోగాలు పొందారు. టెక్నికల్, రికార్డు అసిస్టెంట్లుగా వారికి అవకాశం కల్పించారు.

ఏం చేస్తారో?

ఇన్ని అసంబద్ధతలు, అక్రమాలు, అవినీతి చర్యల నడుమ కునారిల్లుతున్న రెస్కోను గాడిలో పెట్టడానికి జిల్లా అధికారులైతే తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. కానీ ఇక్కడ జరిగిన అవినీతి, అందులో ఎవరి పాత్ర ఎంత ఉందో వారికి సరైన అవగాహన లేదన్న ప్రచారం జరుగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎండీని అక్రమ నియామకాలు పొందిన వారి పరీక్షలను పర్యవేక్షించమనడం దీనికి తాజా నిదర్శనం. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఒక స్పష్టమైన వైఖరిని తీసుకుని ముందుగా రెస్కోలో గతంలో ఏమి జరిగింది. ఎవరి పాత్ర ఎంత అన్న విషయంలో ఒక అవగాహనకు రావాల్సిన అవసరం ఉంది. ఆపైనే తదుపరి చర్యలకు ఉపక్రమిస్తేనే న్యాయం జరుగుతుంది.

పుంగనూరు మండలపరిషత్ ఏవో, సీఏ సస్పెన్షన్

● ఈవోపీఆర్డీపై చర్యలకు సిఫార్సు

● రూ.1.36 కోట్ల గోల్‌మాల్‌పై చర్యలు

పుంగనూరు, జూలై 7: పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి రూ.1.36 కోట్లు గోల్‌మాల్ చేసిన ఘటనలో ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డిని జడ్పీ సీఈవో గ్లోరియా గురువారం సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం కార్యాలయానికి అందాయి. ఈ నిధుల గోల్‌మాల్‌పై గత నెల 20వ తేది ‘ఆంధ్రజ్యోతి’లో ‘అమ్మో..కాంట్రాక్టు ఉద్యోగి’ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. 2022, 2023 సంవత్సరాలలో ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కాంట్రాక్ట్‌పై పనిచేసిన సునీల్ మండల పరిషత్ సాధారణ నిధులు రూ.1,36,68,668 స్వాహా చేశాడు. ఈ రెండేళ్లు ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ నారాయణ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నిధుల స్వాహా జరిగినట్లు విచారణలో తేలింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డిని గురువారం జడ్పీ సీఈవో గ్లోరియా సస్పెండు చేశారు. ఈవోపీఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీవో నారాయణపై శాఖాపరమైనచర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ డీపీవో లక్ష్మికి ఫైల్ పంపారు. వ్యక్తిగతపనిపై ఎంపీడీవో మునిరెడ్డి సెలవులో వెళ్లగా, అధికారుల సస్పెన్షన్‌తో ఎంపీడీవో కార్యాలయం బోసిపోయింది.

నాసిరకం భోజనంపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిత్తూరు రూరల్, జూలై 5: చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందించే భోజనంలో నాణ్యత లేకపోవడంపై శుక్రవారం ‘ఆంధ్రజ్యోతి’లో ‘ఇచ్చిందే మెనూ.. పెట్టిందే తిను!’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ విచారణకు ఆదేశించారు. మెనూపై పూర్తి నివేదిక సమర్పించాలంటూ ప్రభుత్వాస్పత్రి అధికారులకు ఆదేశాలిచ్చారు. భోజన నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

బాగుపడిన శ్మశానం.. దారి

● ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం


పనులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, పంచాయతీ కార్యదర్శి అంజాద్‌బాషా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గంగాధరనెల్లూరు, జూలై 5: నీవానది ఏటి ఒడ్డున శ్మశానం దారి, మృతదేహాలను పూడ్చే స్థలం ఎట్టకేలకు బాగుపడ్డాయి. ఈ ప్రాంతంలో మృతదేహాలను తీసుకెళ్లేందుకు, పూడ్చేందుకు ఉన్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం అంతిమ సంస్కారం ఎలా అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, పంచాయతీ కార్యదర్శి అంజాద్‌బాషా గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సహకారంతో అధికారులు ఎక్స్‌కవేటర్‌తో నీవానది బ్రిడ్జి మొదటి నుంచి శ్మశానానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చికెన్, భవన వ్యర్థాలను తొలగించారు. మృతదేహాలను పూడ్చే స్థలంలో ముళ్లకంపలను శుభ్రం చేశారు. 8 చికెన్ సెంటర్ల నిర్వాహకులకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. అతిక్రమిస్తే షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

‘అమూల్’ సేవలు చాలు

ఇక వెనక్కి వచ్చేయండి ● 22 మంది సహకార శాఖ అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్ల రద్దు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 5: గత ప్రభుత్వంలో ‘అమూల్’ సేవకు పంపిన 22 మంది సహకారశాఖ అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించారు. వీరు మూడున్నరేళ్లుగా డిప్యుటేషన్‌పై అమూల్‌లో పనిచేస్తున్నారు. పాలసేకరణ కోసంసొసైటీల ఏర్పాటు,షేర్ క్యాపిటల్ వసూళ్లు, బ్యాంకు ఖాతాలు తెరవడం, డాక్యుమెంట్ అప్‌లోడ్ వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు రూట్ ఆఫీసర్లుగా గ్రామగ్రామాన తిరుగుతూ అమూల్‌కే పాలు పోయాలంటూ సమావేశాలు పెట్టి నిర్బంధంగా విధులు నిర్వహించారు. దీంతో సహకారశాఖలో పనులు అటకెక్కాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక.. అమూల్ నుంచి ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేశారు. ఈ మేరకు 22 మందిని రిలీవ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అమూల్ పాలఉత్పత్తి సంస్థతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకొని మహిళాసంఘాల పేరుతో పాల సేకరణకు శ్రీకారం చుట్టింది.జగనన్న పాలవెల్లువ పేరుతో డెయిరీ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రభుత్వంలో అదొక భాగంగా పరిగణిస్తూ అమూల్ సిబ్బందిని కాదని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి జగనన్న పాలవెల్లువలో బాధ్యతలు అప్పగించారు. పాలసేకరణకు ఒక్కో గ్రామానికి రూ.మూడు లక్షల విలువైన పరికరాలను ప్రభుత్వనిధుల నుంచి కొన్నారు. సహకారశాఖకు చెందిన అధికారులను అప్ప టి ఉన్నత అధికారి హెచ్.బాబు డెయిరీ కార్యకలాపాలకు వినియోగించడం వల్ల సహకార పనులు ఎక్కడికక్కడనిలిచిపోయాయి. దాంతో అన్ని సహకార సంఘాల్లో ఆడిట్ నిర్వహణకు ఆలస్యమైంది. దీంతో వారి డిప్యుటేషన్‌ను రద్దుచేసి కలెక్టర్ నుంచి నోటిఫికేషన్ పొందాలని డీసీవో నాగవర్ధనను ఆ శాఖ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ హెచ్.బాబు ఆదేశించారు. డిప్యుటేషన్లు రద్దయిన వారిలో.. డెయిరీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జీఏ రవిచంద్రన్, కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు కె.త్యాగరాణి, ఎ.ఇమ్మానుయేల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు బి.ఆర్. పవార్, జి.చంద్రన్, జి.వరలక్ష్మి (పుంగనూరు), కె.వెంకటేశన్, పి.మురళీమోహన్ (కుప్పం), జావీద్ బాషా, సి.పార్థిబన్ (పలమనేరు), ఎన్‌వీ హరిక్రిష్ణ, ఎం.బాబు, జి. పయణి, టి.చెంగ్రాయన్, వై.రమేష్ (పలమనేరు), కె.సులోచన, జి.రజనీకుమార్, టి.ప్రసాద్, జి.ఆనందన్ (పలమనేరు), ఇ.రెడ్డెప్ప (పుంగనూరు), కేవీఆర్ కుమార్, పి.రమణయ్య ఉన్నారు. ఇక డెయిరీ సిబ్బంది పర్యవేక్షణలోనే అమూల్ నిర్వహణ జరగనున్నట్లు సమాచారం.

పెరుగుతున్న దిగుబడులు..తగ్గుతున్న ధరలు

ఆందోళనలో టమోటా రైతులు

సోమల, జూలై 5: టమోటా ధరలు రోజురోజుకూ తగ్గు ముఖం పడు తున్నాయి. శుక్రవారం 15కిలోల బాక్సు రూ.350కి చేరుకుంది. నాణ్యత గల టమోటాలు రూ.350 పలుకుతుండగా రెండో రకం రూ.200నుంచి రూ.300 లోపు పలుకుతున్నాయి. వారం రోజులుగా రూ.750 నుంచి రూ.350కు చేరాయి. టమోటాలు దిగుబడులు భారీగా పెరగడంతో ఇలా రేటు తగ్గుతూ వస్తోంది. మార్చి చివర, ఏప్రిల్ నెలల్లో నాట్లు వేసిన పొలాల నుంచి దిగుబడులు భారీగా రావడం ధరలు తగ్గుముఖం పట్టడానికి కారణమైంది. దీని వల్ల పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.


తాజా, మాజీ కలెక్టర్లు కలిసిన వేళ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 5: జిల్లా మాజీ కలెక్టర్ షన్మోహన్ తాజా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన షన్మోహన్ చిత్తూరు ఆర్ అండ్ బీ అతిథిగృహంలో విడిది చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలుసుకున్నారు.

వీధి దీపాలు సరే.. కరెంటు బిల్లు కట్టరా?

పుంగనూరులో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం ● మూడు నెలలుగా బిల్లు కట్టకపోవడంతో సరఫరా నిలిపివేత

● టీడీపీ నేతల అభ్యర్థనతో పునరుద్ధరించిన డిస్కం అధికారులు



పుంగనూరు, జూలై 5: పుంగనూరులో నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా వెలుగులు విరజిమ్మిలా వీధిదీపాలు అమర్చారు. మూడు నెలలుగా కరెంటు వినియోగించి.. బిల్లు కట్టలేదు. దీంతో విద్యుత్తు శాఖ అధికారులు శుక్రవారం రాత్రి కరెంట్ కట్ చేశారు. పుంగనూరు శివార్లలోని భీమగానిపల్లె శ్రీకృష్ణదేవరాయల విగ్రహం నుంచి రాంపల్లె, కొత్తిండ్లు, పాత బస్టాండ్, ఇందిరాసర్కిల్, ఎంబీటీ రోడ్డు, తూర్పుమొగసాల, పలమనేరు రోడ్డు, గూడూరుపల్లె మీదుగా అరబ్బిక్ కాలేజీ వరకు కేంద్రప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు, కల్వర్టులు, ప్లాట్‌ఫారం, 10 కిలోమీటర్ల రోడ్డును ఎన్‌హెచ్ అధికారులు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా ఇళ్లులేకపోయినా జాతీయ రహదారుల అధికారులు 510 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీ యుద్ధప్రాతిపదికన పనులు వేగవంతం చేసి లైట్లు అమర్చింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి టెస్టింగ్ పేరుతో కరెంట్ కనెక్షన్లు తీసుకున్నారు. ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు కరెంట్ వాడుతున్నారని వెంటనే మూడునెలల క్రితం వీధి దీపాలకు ఉపయోగించే కరెంట్‌కు మీటర్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి విద్యుత్ అధికారులు పనులు పర్యవేక్షించే ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్ వెంటపడుతూ మీటరు ఎవరి పేరుతో రికార్డు చేయాలి, కరెంట్ వినియోగానికి ఎవరు బిల్లు చెల్లిస్తారని పలుమార్లు అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్‌హెచ్ అధికారులు మాత్రం మున్సిపాలిటీ వారు చెల్లిస్తారని చెప్పడం మొదలుపెట్టారు. కాగా, పుంగనూరు పట్టణంలో వెలిగే లైట్లు తక్కువ, ఇక్కడ ఆదాయం, బడ్జెట్ తక్కువగా ఉండటంతో తమకు కష్టమని మున్సిపాలిటీ చెప్పింది. ఎన్నిలైట్లు వేశారనే సమాచారాన్ని మున్సిపాలిటీకి ఇవ్వకుండా, తమకు అప్పగించకుండా తామెలా బిల్లు కడుతామని కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్‌హెచ్ అధికారులే బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. పలుమార్లు ఎన్‌హెచ్ అధికారులకు ఫోన్, లిఖితపూర్వకంగా లేఖలు పంపినా స్పందన లేదని మున్సిపల్, విద్యుత్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 510 విద్యుత్ దీపాలకు కరెంట్ ఉపయోగించి ఒక్కపైసా బిల్లు చెల్లించకపోవడంతో ఎనర్జీ ఆడిట్‌లో తమకు ఇబ్బందులు తప్పవని, ముందు కరెంట్ బిల్లు ఎవరు చెల్లిస్తారో తేల్చుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ శశిధర్ వీధిదీపాలకు కరెంట్ కట్ చేయించారు. పుంగనూరులో వీధిదీపాలు వెలగక చీకటిలో ఉంటే ప్రమాదాలు, ఇతర ఘటనలు జరుగుతాయని, రెండురోజుల్లో ఈసమస్య పరిష్కారమవుతుందని తెలుగుదేశం పార్టీనాయకులు కోరారు. దీంతో అధికారులు సరఫరాను పునరుద్ధరించారు.

ఆగ్రో బయోఫ్యూచర్ కంపెనీలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్కుఫోర్స్ అధికారులు

పలమనేరు, జూలై5 : పలమనేరు మండలం కొలమాసనపల్లి లోని ఆగ్రోబయోఫ్యూచర్ కంపెనీలో టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. కంపెనీలో తయారు అవుతున్న ఎరువులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశాల మేరకు వీరు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన ఎరువులను, విత్తనాలను పురుగుమందులను అంద జేయాలన్న ధ్యేయంతోనే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి ఎరువుల నాణ్యత, సంస్థ సామర్థ్యం, తదితర వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వారు తెలిపారు. ఈ తనిఖీలో అధికారులు డీపీడీ దేవనారాయణ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి చంద్రశేఖర్, పలమనేరు మండల వ్యవసాయశాఖ అధికారిణి సంధ్య పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తిరుమలలో తనిఖీలు కొనసాగిస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చిన క్రమంలో రెండువారాలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు టీటీడీలోని పలు విభాగాల్లో సోదాలు చేస్తున్నారు. ఆయా విభాగాల అధికారులు, కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, బదిలీపై వెళ్లిన అధికారులు, వారి వివరాలను సేకరించడంతో పాటు నిధులను ఎక్కడ, ఎలా వినియోగించారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. తాజాగా, గురువారం ఎస్టేట్ విభాగంతో పాటు సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించే ఈవో కార్యాలయంలోనూ సోదాలు చేసినట్టు సమాచారం. ఈవో కార్యాలయంలోని ఇద్దరు ముఖ్యమైన అధికారులను ప్రశ్నించి స్టేట్‌మెంట్ తీసుకున్నట్టు తెలిసింది. వీఐపీ బ్రేక్ టికెట్లు ఎలా కేటాయిస్తున్నారు, ఎవరికి కేటాయిస్తున్నారు, కేటాయింపుల్లో ఏవైనా అక్రమాలు జరిగాయా అనే కోణంలో విచారించినట్టు తెలిసింది. ఇక, తిరుపతిలోనూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో శుక్రవారం సోదాలు చేసి పలు రికార్డులు తీసుకున్నట్టు సమాచారం.మరో రెండుమూడువారాల పాటు సోదాలు జరగనున్నట్టు సమాచారం.

టూరిజం హబ్‌గా తిరుపతి

మంత్రి కందుల దుర్గేశ్


పర్యాటక శాఖ అధికారులతో మంత్రి దుర్గేశ్ సమీక్ష

చంద్రగిరి/తిరుపతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని టెంపుల్...ఎకో...హెల్త్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అక్కడే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరాగం పేరిట ఏర్పాటు చేసిన హోటల్‌ను ప్రారంభించారు.అనంతరం తిరుపతి చేరుకుని జూపార్కు సమీపంలో టూరిజం శాఖకు కేటాయించిన 30 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.ఏపీ టూరిజం కార్యాలయం, భవనాలు, స్థలం, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను తనిఖీ చేశారు. పర్యాటకాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో సినీ స్టూడియో నిర్మాణంపై నిర్మాతలతో మాట్లాడతామన్నారు. పర్యాటక అభివృద్ధికి చాలా అవకాశాలున్నా గత ప్రభుత్వం ఒక్క కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్.. రోప్‌వే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు. జూపార్క్ దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలు ఓబరాయ్ హోటల్‌కు, 10 ఎకరాలు దేవ్‌లోక్ సంస్థకు గతంలో ఇచ్చినా వినియోగించుకోలేదన్నారు. జూలైలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.రుయాస్పత్రి ఎదురుగా అసంపూర్తిగా వున్న టూరిజం బిల్డింగ్‌పై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.చంద్రగిరి కోటలో ఏర్పాటు చేసిన లైట్ అండ్ మ్యూజిక్ షోను త్వరలోనే పునఃప్రారంభిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టూరిజం ఎండీ కన్నబాబు,రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీవీఎం గిరిధర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 5: జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో ఐదు మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. పెనుమూరులో 16.6మి.మీ, శ్రీరంగరాజపురం 10.4, పూతలపట్టు 9.8, చిత్తూరు రూరల్ 6.0, పాలసముద్రంలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

వరసిద్ధుడి సేవలో రాజధాని రైతులు



ఐరాల(కాణిపాకం), జూలై 5: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం రాజధాని ప్రాంతమైన తుళ్లూరుకు చెందిన 150 మంది రైతులు దర్శించుకున్నారు. తమ కష్టాలు తీరి రాష్ట్రం అభివృద్ధి చెందాలని వరసిద్ధుడికి, తిరుమల శ్రీవారికి మొక్కుకున్నామని, ఇప్పుడా మొక్కులు తీర్చుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కంపెనీలు వచ్చి యువత అందరికీ ఉద్యోగాలు రావాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. వీరి వెంట ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మిట్టకురప్పల్లె పాఠశాలవద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

బైరెడ్డిపల్లె, జూలై 5 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ కోరారు. మండలంలోని మిట్టకురప్పల్లె ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తామని పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గౌరప్పగౌడు, హెచ్‌ఎం భువనేశ్వరి, ఉపాధ్యాయురాలు శ్రీదేవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన



బైరెడ్డిపల్లె, జూలై 5 : మండలంలోని లక్కనపల్లె ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చేతులశుభ్రతపై విద్యార్థులకు తీర్థం పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ అవగాహన కల్పించారు. అతిసార నివారణ, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఆశ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన, పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి



ప్రసంగిస్తున్న జిల్లావిద్యాశాఖ అధికారి దేవరాజులు

పలమనేరు,జూలై5 : ఉపాధ్యాయులు బోధన, పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని అప్పుడే విద్యార్థులకు చక్కటి బోధన అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరులో జరుగుతున్న ఆరు మండలాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఎం ఆర్‌టీల టీచ్‌టూల్ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మారుతున్న పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తినైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఈ టీచ్‌టూల్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లీలారాణి, ఎ.ఎల్.ఎస్ కో-ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రంలో తనిఖీలు



స్కానింగ్ కేంద్రంలో నోడల్ అధికారి డాక్టర్ శిరీష

పలమనేరు, జూలై5 : పలమనేరు వంద పడకల ఆస్పత్రిలోని స్కానింగ్ కేంద్రాన్ని శుక్రవారం పీసీ అండ్ పీఎన్ డీటీ ఆక్టు ఇన్‌ఛార్జి నోడల్ అధికారి డాక్టర్ శిరీష తనిఖీ చేశారు. స్కానింగ్ పరికరాలను, రికార్డులను పరిశీలించారు. లింగనిర్ధారణ చట్టం తీవ్రత గురించి వైద్యాధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్‌ఎంఓ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



సూపరింటెండెంట్ మమతారాణికి వినతి పత్రం అందజేస్తున్న గిరిధరగుప్తా తదితరులు

పలమనేరు, జూలై5 : పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత 5నెలలుగా జీతాలు అందలేదని వెంటనే అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గిరిధరగుప్తా డిమాండు చేశారు. శుక్రవారం ఆస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులతో కలిసి సూపరింటెండెంట్ మమతారాణికి ఆయన వినతిపత్రం సమర్పించారు. చాలీచాలని జీతాలతో కార్మికులు పని చేస్తున్నారని కుటుంబ పోషణ భారంగా మారిందని పేర్కొన్నారు. అలాగే యూనిఫారాలు, చెప్పులు, గ్లౌజులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు లోకేష్, విజయమ్మ, బుజ్జమ్మ, ఈశ్వరమ్మ, నాగమ్మ, వేణుగోపాల్, రామక్రిష్ణ, నారాయణమ్మ, లలిత, దేవరాజులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు



దేవదొడ్డిలో విశేషాలంకరణలో అంకాళపరమేశ్వరి

బైరెడ్డిపల్లె, జూలై 5 : బైరెడ్డిపల్లెలోని బాట గంగమ్మ ఆలయం, దేవదొడ్డి గ్రామంలో వున్న అంకాళ పరమేశ్వరీ ఆలయాల్లో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు అర్చకులు అభిషేకంచేసి విశేషాలం కరణతో పూజలు జరిపారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. నిర్వాహకులు ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

జగన్ పత్రికది తప్పుడు కథనం

పలమనేరు, జూలై5 : మండలంలోని చామనేరు పంచాయితీ గోనుమాకుల పల్లి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ తలారి మునెప్ప(75) అనారోగ్యంతో, వయోభారంతో చనిపోయారని టీడీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి, విశ్రాంత ఇంటిలిజెన్స్ సిబ్బంది తెలియజేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మునెప్ప అనారోగ్యంతో మృతిచెందితే జగన్ పత్రికలో టీడీపీ నేతల వేధింపులతో చనిపోయారని పేర్కొనడం గర్హనీయ మన్నారు. తమ వద్ద తీసుకున్న అప్పును ఎగవేసేందుకు మునెప్ప కుమారుడు ఇటువంటి నిరాధారమైన ఆరోపణలకు పాల్పడుతున్నాడని వివరించారు.

8న పుంగనూరు ఐటీఐలో జాబ్‌మేళా

పుంగనూరు రూరల్, జూలై 5: పుంగనూరు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కాలేజీలో ఈ నెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు, తంబళ్లపల్లె ఐటీఐలో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం శిక్షణ పొందే విద్యార్థులు, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు జాబ్‌మేళాలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో జాబ్‌మేళాకు హాజరుకావాల్సి ఉంటుందని తెలియజేశారు. బెంగళూరు, చెన్నై హైదరాబాదుకు చెందిన కంపెనీల యాజమాన్యాలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు, జూలై 5: పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో బీఏ, బీకాం, బీఎస్సీ తో పాటు ఒకేషన్ కోర్సులో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 10తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 11నుంచి 15 తేదీ వరకు విద్యార్థులు సబ్జెక్టులు ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. 19తేదీ సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఈ కోర్సులతో పాటు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, కంప్యూటర్ కోర్సులు ఉన్నాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యాసామాగ్రి అందజేత



రామకుప్పం, జూలై 5: రామకుప్పం మండలం ఆవులకుప్పం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం తెలుగు యువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొంగాటంలో టీడీపీ ఫ్లెక్సీల చించివేత



వి.కోట, జూలై 5: వి.కోట మండలం కొంగాటం గ్రామంలో టీడీపీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసీపీ వర్గీయులు చించి వేశారు. ఇటీవల పలమ నేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జన్మ దినాన్ని పురస్కరించుకుని టీడీపీ నేతలు, కార్యకర్తలు కొంగాటంలో పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి కొందరు వైసీపీ వర్గీయులు ఫ్లెక్సీలను కావాలనే చించేశారని టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



చౌడేపల్లె, జూలై5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు రాహుకాలపూజలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో చంద్రమౌళి భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగ్నిప్రమాద కుటుంబానికి ఆర్థికసాయం

పలమనేరు, జూలై5 : పలమనేరు సమీపంలోని సిల్కుఫారం వద్ద నివాస ముంటున్న హరి అనే లారీ క్లీనర్ ఇటీవల అగ్నిప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో అతని కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకొన్న ఇక్కడి మానవహక్కుల మండలి నాయకులు రూ.5,500 విలువ చేసే నిత్యావసర సరు కులను, నగదును శుక్రవారం హరి కుటుంబానికి అందజేశారు. మానవ హక్కుల మండలి నాయకులు సుభాన్, అహమ్మద్, షరీఫ్, రమేష్, అష్రఫ్, బద్రున్నిసా, సాజిదా, సూరజ్, గౌస్‌బాషా పాల్గొన్నారు.

హాస్టల్ భవనాల నిర్మాణానికి
ప్రతిపాదనలు సిద్ధం చేయండి



కుప్పంలోని వసతి గృహంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, జూలై 5: కుప్పం నియోజకవర్గ పరిధిలో శిథిల స్థితిలో ఉన్న సంక్షేమ వసతి గృహాల నూతన భవనాల నిర్మాణంకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కుప్పం పట్టణం పాతపేట మునస్వామిపురంలో ఉన్న బీసీ, ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్నానపు గదులు, కాలువలు అధ్వానంగా ఉన్న విషయం గమనించారు. హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంవల్ల దోమల బెడద అధికంగా ఉన్నట్టు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. హాస్టల్ భవనాలు శిథిల స్థితికి చేరుకోవడం చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. స్నానపుగదుల శుభ్రత వెంటనే చేపట్టాలని సూచించారు. దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే భవనాలు శిథిల స్థితిలో ఉన్నందున సుమారు 200 మంది విద్యార్థులు నివశించేలా నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. త్వరలోనే వసతి గృహాల స్థితిగతులను మార్చి, నాణ్యమైన భోజనం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, సంక్షేమ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు, రాజ్‌కుమార్, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కల్లూరు, జూలై 5: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. కల్లూరులోని జాతీయ రహదారిపై పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. స్కూలు బస్సులు కండీషన్‌తో ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఇన్సూరెన్స్, పర్మిట్, అటెండర్ తప్పక ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు తప్పవని వారు హెచ్చరించారు.

కల్లూరు ఎస్ఐకు ఘన సన్మానం

పులిచెర్ల మండలం కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డిని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కల్లూరు ఎస్ఐ ఉత్తమ సేవలు అందించడంతో ఎస్పీ మణికంఠ చందోలు ప్రశంసాపత్రం అందజేశారు. దీంతో టీడీపీ నాయకులు ఆయన్ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్ఐ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూర్ బాషా, అబ్బాస్, అష్రఫ్, ఈఎం రత్నం, సర్దార్, పార్థసారధి, మల్లికార్జున్, యూనస్, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

అడవినాథునికుంటలో లోపించిన పారిశుధ్యం



కాలువ లేని రోడ్డు

పుంగనూరు రూరల్, జూలై5: మండలంలోని రాగానిపల్లె పంచాయతీ అడవినాథునికుంటలో పారిశుధ్యం లోపించింది. ఫలితంగా దోమలు వృద్ధిచెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో వేసిన సీసీ రోడ్ల వెంట మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థపునీరు, వర్షపునీరు వీధుల్లో ప్రవహిస్తోంది. మురుగు నిలవడంతో దోమలు వృద్ధిచెందుతున్నాయి. అలాగే మురుగు దుర్వాసన వల్ల ఇళ్లలో ఉండలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, సచివాలయ, పంచాయతీ అధికారులకు చెప్పినా ఫలితం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.

విరూపాక్షిమారెమ్మకు విశేషపూజలు



పుంగనూరు రూరల్, జూలై 5: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆల య అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు ఉపవాసాలతో భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

స్వస్థలాలకు అమరనాథయాత్రికులు



పుంగనూరు, జూలై 5: గత నెల 26వ తేదీ చిత్తూరు, పీలేరు, సోమలకు చెందిన 16 మంది సభ్యులు గల భక్తులు అమరనాథయాత్రకు వెళ్లారు. ప్రస్తుతం తిరుగు ప్రయాణ మయ్యారు. ఆరేళ్లుగా యాత్ర సాగిస్తూ ఆలయాలు దర్శించుకుని వస్తున్నట్లు తెలిపారు. అదేక్రమంలో ఈనెల 3న అమర నాథ యాత్ర ముగించుకుని స్వస్థలాలకు బయలుదేరినట్లు వారు వివరించారు.

బైరెడ్డిపల్లె నెహ్రూనగర్‌లో పాముల భయం



బైరెడ్డిపల్లె నెహ్రూనగర్‌లో లోపించిన పారిశుధ్యం

బైరెడ్డిపల్లె, జూలై 5 : బైరెడ్డిపల్లె పట్టణంలోని నెహ్రూనగర్‌లో జనం పాములతో భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. ఇక్కడి జనావాసాల మధ్య వున్న ఖాళీప్రదేశాల్లో పిచ్చి మొక్కలు, గుబురు పొదలతో నిండిపోయి అడవిని తలపిస్తోంది. అలాగే మురుగునీటి కాలువల్లో మట్టి పేరుకుపోయి కాలువపూడిపోయి చెత్తాచెదారంతో నిండిపోయాయి. పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీని కారణంగా విషసర్పాలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. రాత్రిపూట బయట తిరగాలంటే హడలిపోతున్నారు. ఇటీవల నెహ్రూనగర్‌లో పలువురి ఇళ్లలోకి పాములు ప్రవేశించడంతో రాత్రంతా జాగరణ చేయాల్సివచ్చిందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి నెహ్రూనగర్‌లో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

లక్ష్మీనరసింహుడికి అభిషేక పూజలు



కల్లూరు, జూలై 5: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలు వైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం అభిషేకం పూజలు చేశారు. వివిధ రకాల పుష్పా లతో అలం కృతుడైన లక్ష్మీ నరసింహ స్వామి భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. భక్తులకు అర్చకులు అనంతకుమా రాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయ దారులుగా చల్లావారిపల్లికి చెందిన మునిరాజ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

విద్యాసామగ్రి పంపిణీ



శాంతిపురం, జూలై 5: శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం టీడీపీ మండల ప్రధానకార్యదర్శి నాగరాజు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి, నాయకులు చలపతి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఎంఈవో శివరత్న

సోమల, జూలై 5: ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శివరత్న కోరారు. శుక్రవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రైవేటు బడులకు స్వస్తి చెప్పి ప్రభుత్వ బడుల్లోనే చేరాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజ, హరినాథ్, మమత, జ్యోతీశ్వరుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అన్యాయం చేస్తే ఊరుకోం

పలమనేరు, జూలై5 : ఉపాధి కూలీలకు అన్యాయం చేస్తే ఊరుకొనేది లేదని బహుజన రైతు ఉపాధి కూలీల మహాజనసభ నాయకులు శివాడి గోవిందు అధికారులకు హెచ్చరించారు. శుక్ర వారం పలమనేరులోని మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా గ్రామాల్లో ఉపాధి పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బినామి పేర్లతో దళారులు కూలీలకు చెందాల్సిన సొమ్మును దోచుకొంటున్నారని ఇందుకు కారణం వారికి మద్దతుగా నిలుస్తున్న కొందరు ఉపాధి హామీ అధికారులేనని ఆరోపించారు. ఈ సమావేశంలో సంస్థ జిల్లా అధ్యక్షులు డీవీ మునిరత్నం, పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండల తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసుకొన్నారు. కన్వీనర్‌గా శివాడి గోవిందు, కో-కన్వీనర్‌లుగా ఆదిశేఖర్, బాలయ్య, ఆర్గనైజర్‌లుగా కోటేశ్వర్, మురళి, రమేష్, ప్రకాష్, గంగాధర్‌లను ఎన్నుకొన్నారు.

ఎన్టీఆర్ సుజల ట్యాంకులపై మాజీల ఫొటోలు తొలగించాలి



గుడుపల్లె, జూలై5: మండలం పరిధిలోని గుండ్లసాగరం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల మంచి నీటి ట్యాంకులపై ఉన్న మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫొటోలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించి మాజీల ఫొటోలు తొలగించి సీఎం చంద్రబాబు ఫొటోను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేడు జునోసిస్ డే

పుంగనూరు రూరల్, జూలై 5: అంతర్జాతీయ జునోసిస్ డే సందర్భంగా పుంగనూరులోని పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా యాంటీర్యాబిస్ వ్యాక్సినేషన్‌ను వేయనున్నట్లు పుంగనూరు పశుసంవర్థక శాఖ ఏడీ మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెంపుడు శునకాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయాల పునరుద్ధరణకు చర్యలు



రాళ్లబూదుగూరు కోదండరామస్వామి ఆలయంలో చర్చలు జరుపుతున్న అధికారులు

కుప్పం, జూలై 5: కుప్పం నియోజకవర్గంలో త్వరలోనే ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోనున్నట్లు దేవదాయ శాఖాధికారులు తెలిపారు. వారు శుక్రవారం సైతం నియోజకవర్గంలోని వివిధ ఆలయాలను సందర్శించారు. కుప్పంలోని బేటరాయ స్వామి ఆలయం, మల్లప్పకొండ ఆలయం, శాంతిపురం మండలం రాళ్లబూదు గూరు లోని కోదండరామస్వామి ఆలయం, రామకుప్పంలోని వళ్లీదేవసేనా సమేత కోదండరామస్వామి ఆలయం తదితర ఆలయాలకు వెళ్లారు. అక్కడి పరిస్థితులను పరిశీ లించారు. శిథిల స్థితిలో ఉన్న ఆలయాల పునరుద్ధరణకు ఏయే చర్యలు అవసరమో స్థానికులతో, పూజారి బృందంతో చర్చించారు. నిత్య పూజా కైంకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆలయాల సందర్శన చేశామన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 10 ఆలయాల పునరుద్ధరణకు మొదటి దశలో చర్యలు చేపడుతామన్నారు. అందుకు తగిన అంచనాలు, నివేదికలు తయారు చేసి, ఉన్నతాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ స్థపతి నెహ్రూ, డిప్యూటీ ఈఈ చక్రధర్‌రావు, అసిస్టెంట్ స్థపతి దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కార్వేటినగరం ప్రభుత్వాస్పత్రిలో ఎమ్మెల్యే తనిఖీలు


ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం, జూలై 5: స్థానిక ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శుక్రవారం అసంపూర్తిగా ఉన్న 50 పడకల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. మెరుగైన వైద్యం అందివ్వాలని చెప్పారు. మండల కాంప్లెక్స్‌లో దీపాలు వెలగడం లేదని చెప్పడంతో వెంటనే విద్యుత్ అధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. నూతన ఆర్చి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే థామస్

చిత్తూరు : నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను జీడీ నెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఉన్న కలెక్టర్‌ను సన్మానించారు. అనంతరం జీడీ నెల్లూరు నియోజకవర్గ సమస్యలు, అవసరమైన పనుల గురించి చర్చించారు.

వరసిద్ధుడి సేవలో కాకినాడ కలెక్టర్



ఐరాల(కాణిపాకం), జూలై 5: కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో వెంకటేశు ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చిత్తూరు, జూలై 5: విజయపురం పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సుబ్రహ్మణ్యం భార్య అమ్ములుకు కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును ఏఎస్పీ అరీఫుల్లా శుక్రవారం అందించారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



గుట్టకింద దళితవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

యాదమరి, జూలై 5: దోమలను అంతమొందించడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చునని యాదమరి సీహెచ్‌వో లక్ష్మీనారాయణ అన్నారు. యాదమరి పీహెచ్‌సీ పరిధిలోని గుట్టకింద దళితవాడలో శుక్రవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు


పన్నూరులో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

విజయపురం, జూలై 5: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. విజయపురం, జగన్నాథపురం, పన్నూరు, కోసలనగరంలో చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లారు. నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈవోపీఆర్డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టూరిజం శాఖ మంత్రికి సన్మానం



పాలసముద్రం, జూలై 5: తిరుమల పర్యటనకు వచ్చిన రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు జనసేన, టీడీపీ నాయకులతో కలిసి సన్మానించారు. అలాగే తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో కలిసి సన్మానించారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

పాలసముద్రం, జూలై 5: మండలంలోని డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం ఫరీద్‌మస్తాన్ కోరారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలు, సీసీలతో ఆయన సమావేశమయ్యారు. బ్యాంకు రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు ప్రతినెలా కంతులను సక్రమంగా కట్టేటట్లు చూడాలన్నారు. గ్రామాల్లో మహిళలు వ్యవసాయంతో పాటు పాడి ఆవులు, చిన్నచిన్న తినుబండారాల హోటళ్ల ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. సీసీలు చిరంజీవి, మురగయ్య పాల్గొన్నారు.

భవన కార్మికులకు ప్రభుత్వం అండ

నగరి, జూలై5: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయనున్నట్లు పేర్కొన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చడానికి ఉచితంగా ఇసుక ఇవ్వనున్నట్లు తెలిపారు. కేవలం లోడింగ్, రవాణా చార్జీలు చెల్లించి ఇసుక పొందేలా త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

నగరి, జూలై5: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎంఈవో నమశ్శివాయ పేర్కొన్నారు. మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, మెనూ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి చూసి, ఎప్పుడూ ఇలాగే పెట్టాలని సూచించారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

గుడిపాల, జూలై 5: మహిళలు స్వయంశక్తితో ఎదగాలని వెలుగు సీసీ లోకనాథరెడ్డి, సంఘమిత్ర కవిత కోరారు. మండలంలోని గట్రాళ్లమిట్ట పంచాయతీలో శుక్రవారం మహిళా సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రుణాలు ఎలా పొందాలి.. ఎలా కట్టాలి తదితర అంశాలపై సూచనలు చేశారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ఫొటోలకు పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, లాయర్ బిందు పాల్గొన్నారు.

అన్న క్యాంటీలో టీడీపీ నేత అన్నదానం



గుడిపాల, జూలై 5: మండలంలోని అన్న క్యాంటీన్‌లో శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు భోజన వితరణ చేశారు. టీడీపీ నాయకులు బోడెబ్బ నాయుడు, కిట్టు, జయదేవ నాయుడు, రవి నాయుడు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి శుక్రవార పూజలు


దుర్గాంబాలయంలో దీపారాధన

చిత్తూరు కల్చరల్, జూలై 5: నగరంలోని పలు ఆలయాల్లో ఆషాడమాస తొలి శుక్రవార పూజలు వైభవంగా నిర్వహించారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో మహిళా భక్తులు దీపారాధన చేసి, మొక్కులు తీర్చుకున్నారు. కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయం, రాజుగుడి, ఇరువారం నాగేంద్ర, కట్టమంచి కులందేశ్వర, దొడిపల్లె సప్తకన్నికల, చవటపల్లె కనకదుర్గ, చౌడేశ్వరి దేవి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు.

రేపు బౌద్ధ ధర్మ ఉపన్యాసం

చిత్తూరు కల్చరల్, జూలై 5: గిరింపేట పీవీకేఎన్ మ్యాంగో భవన్‌లో ఆదివారం జిల్లా బౌద్ధ ధర్మ సంఘం ఆధ్వర్యంలో ఈనాటి పరిస్థితుల్లో బౌద్ధం అవసరం అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ బౌద్ధ సాహితీవేత్త, ప్రచారకులు బొర్రా గోవర్ధన్ ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు


ఎన్టీఆర్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలతో కనకమ్మ

గంగాధరనెల్లూరు, జూలై 5: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని కొత్తవెంటాపురం సర్పంచ్ బొడపాటి కనకమ్మ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం కొత్తవెంకటాపురం సచివాలయానికి టీడీపీ నేతలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఆమె తీసుకొచ్చి అధికారులకు అందజేసి, కార్యాలయంలో ఏర్పాటు చేయించారు.

కుష్ఠు నివారణకే బీసీజీ వ్యాక్సినేషన్


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటప్రసాద్

గంగాధరనెల్లూరు, జూలై 5: 60 ఏళ్లకు పైబడిన వారికి కుష్ఠు వ్యాధి రాకుండా నివారించడానికే బీసీజీ వ్యాక్సినేషన్ చేయిస్తున్నామని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలో శుక్రవారం ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. పీహెచ్‌సీ పరిధిలో 10,996 మందికి వ్యాక్సినేషన్ చేయాలని లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 2,386మందికి వేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దుర్గాదేవి, ప్రవీణ్, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ధర్మేంద్ర, షైలా పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జలాశయం అభివృద్ధికి సహకారం


గురజాలతో మాట్లాడుతున్న హరిబాబునాయుడు

పెనుమూరు, జూలై 5: మండలంలోని ఎన్టీఆర్ జలాశయం అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కోరారు. శుక్రవారం చిత్తూరులోని ఆయన నివాసంలో కలిసి చర్చించారు. ఎన్టీఆర్ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చన్నారు. బోటింగ్, పార్క్ వంటివి ఏర్పాటు చేస్తే ఆదాయంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. చిత్తూరుకు తాగునీరు కూడా అందుతుందని వివరించారు.

ఎమ్మెల్యేకు సీఎంసీ ప్రతినిధుల శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ : ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు సీఎంసీ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యేను సీఎంసీ చిత్తూరు క్యాంపస్ డైరెక్టర్లు డాక్టర్ కెన్నీ శామ్యుల్ డేవిడ్, డాక్టర్ ఉదయ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రిన్స్ తదితరులు కలిశారు.

పారిశుధ్య పనులను వేగవంతం చేయండి


మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న డీపీవో లక్ష్మి

బంగారుపాళ్యం, జూలై 5: పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని డీపీవో లక్ష్మి అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. మురుగు నీటి నిల్వ కారణంగా దోమలు వృద్ధి చెందుతాయని, కాల్వలను ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు శంకర్, అవంతి పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధే ఏకైక లక్ష్యం

- మేయర్ అముద అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం
- ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్యేల ప్రమాణం



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు - సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు, జూలై 5: అందరి సహకారంతో చిత్తూరు నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మేయర్ అముద అధ్యక్షతన నిర్వహించారు. ఎక్స్ అఫిషియో మెంబర్లుగా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్ ప్రమాణం చేశారు.

ఆమోదించిన అంశాలు

నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అజెండా, టేబుల్ అజెండాలోని అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారు.

- చిత్తూరు నగరపాలక సంస్థ ఎక్స్ అఫిషియో మెంబర్ల ఎంపికకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్ అనుమతి తెలియజేశారు.
- వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సీఎఫ్ఎంఎస్ పోర్టల్ నుంచి తొలగించి.. ఆ పనులకు ఇదివరకే ఆమోదించిన కౌన్సిల్ ప్రస్తావనను ర్యాటిఫై చేశారు.
- అన్నా క్యాంటీన్ వద్ద నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటుకు ఆమోదించారు.
- నగరపాలక సంస్థలోని మున్సిపల్ స్టాండింగ్ కమిటీ కోసం అందిన దరఖాస్తుల నుంచి నాగకుమార్ పేరును ఎమ్మెల్యే ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు.
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించడానికి రూ.138.50 లక్షల నిధులను ఖర్చు చేయడానికి ఆమోదించారు. ఏఎస్ఎం కాంప్లెక్స్, ఎంఎస్ఆర్ కాంప్లెక్స్ జైహింద్, గుర్రప్పనాయుడు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించడానికి ఆమోదించారు.
- సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా అందించడానికి కౌన్సిల్ ఆమోద ముద్రవేసింది.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా అభివృద్ధి : గురజాల



మార్కెట్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ వివరించారు. నగరంలో అనువైన ప్రాంతాల్లో మార్కెట్లను, రైతు బజార్లను, మామిడికాయల మండీలను అభివృద్ధి చేస్తామన్నారు. అడవిపల్లె రిజర్వాయర్ పనులను మరో ఆరు నెలల్లో పూర్తి చేసి, ఆరు నెలల్లో ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా తాగునీటిని అందిస్తామన్నారు.

రైతులకు తగిన ప్రాధాన్యత : మురళీ మోహన్



చిత్తూరులో అభివృద్ధి చేస్తున్న మార్కెట్‌లో పరిసర మండలాల రైతులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఎక్స్ అఫిషియో మెంబరు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ కోరారు. చిత్తూరు మార్కెట్‌ను ఇంటిగ్రేటెడ్ స్థాయికి అభివృద్ధి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం


సిబ్బందికి క్యాష్ రివార్డు అందిస్తున్న సుబ్బరాజు

చిత్తూరు, జూలై 5: మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్ఈబీ డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసర్ సుబ్బరాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన పోలీసు శిక్షణా కేంద్రంలో ఎస్ఈబీ అధికారులతో సమావేశమయ్యారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి అక్రమ మద్యం, సారా తయారీని అరికట్టాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా విచారించి, నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. గ్రామాల్లో మహిళా పోలీసుల సాయంతో సారా తయారీ, విక్రయాలపై దాడులు నిర్వహించాలన్నారు. అక్రమ మద్యం జిల్లాకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సారాను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఈబీ అధికారులు, సిబ్బందికి క్యాష్ రివార్డులు అందించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పీఎఫ్ లెక్కలు తేల్చండి : ఎస్టీయూ


జడ్పీ సీఈవోతో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు రూరల్, జూలై 5: ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ మొత్తాల వివరాలను బహిర్గతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్ రెడ్డి, మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో గ్లోరియాను కలిసి దీనిపై చర్చించారు. కోట్లాది రూపాయల పీఎఫ్ మొత్తాల వివరాలను దాచాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్లో లేకపోవడంతో రుణాలు పొందడానికి, తుది మొత్తాలను తీసుకోవడానికి ఉద్యోగ ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అకాల మరణం పొందిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించడంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్ మిస్సింగ్ క్రెడిట్‌కు సంబంధించి టీచర్లు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా జీతాల డ్రాయింగ్ ఆఫీసర్లకు సూచనలు జారీ చేయాలని కోరారు. జడ్పీ ఉన్నత పాఠశాలలకు బోధనేతర సిబ్బందిని నియమించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నేతలు గంటా మోహన్, హేమచంద్రారెడ్డి, పురుషోత్తంనాయుడు, లోకనాథ్‌రెడ్డి, దేవరాజులురెడ్డి, మునెప్ప, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువు కాదది రోడ్డే!


దేవళంపేటలో చెరువును తలపిస్తున్న రహదారి

వెదురుకుప్పం, జూలై 5: ఈ ఫొటోలో కనిపిస్తున్నది చెరువు అనుకుంటే పొరపాటు పడ్డట్టే. ఇది వెదురుకుప్పం చిత్తూరు రహదారిలోని దేవళంపేట ఇండియన్ బ్యాంకు ముందర ఉన్న రోడ్డు. తేలికపాటి వానొచ్చినా ఆ రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అధికార యంత్రాంగం దృష్టికి చాలాసార్లు తీసుకెళ్లినా పరిష్కారం చూపక పోవడంతో వానొచ్చిన ప్రతిసారీ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. శుక్రవారం సాయంత్రం కురిసిన వానకు ఇలా వాహనదారులు అవస్థలు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన తమిళనాడు వాసులు

గుడిపాల, జూలై5 : మండలంలోని చిత్తూరు వేలూరు జాతీయ రహదారి కిల్లారిపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడు లతేరికి చెందిన ముగ్గురు వ్యక్తులు చిత్తూరు నుంచి వేలూరు వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. కిల్లారపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. గుడిపాల ఎస్ఐ నరేంద్రకుమార్ అక్కడికి చేరుకుని వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బైక్‌ను కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

డీసీఈబీ కార్యదర్శిగా పరశురాంనాయుడు



చిత్తూరు (సెంట్రల్), జూలై 5 : ఉమ్మడి జిల్లా పరీక్షా కేంద్ర (డీసీఈబీ) కార్యదర్శిగా పరశురాంను నియమిస్తూ డీఈవో దేవరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న హేమారెడ్డి ఉద్యోగ విరమణతో ఈ పోస్టు ఖాళీ అయింది. వి.కోట మండలం జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎంగా పనిచేస్తున్న పరశురాంనాయుడును ఈ స్థానంలో నియమించారు. కాగా, ఈయన పదవీ కాలం ఈ ఏడాది డిసెంబరుతో ముగియనుంది.

జూనోసిస్ దినోత్సవానికి ఏర్పాట్లు

చిత్తూరు (సెంట్రల్), జూలై 5: ప్రపంచ జూనోసిస్ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని పశువైద్యశాలలు, చిత్తూరులోని వెటర్నరీ పోలి క్లినిక్‌లో శునకాలకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. శునకాలు పెంచుకుంటున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిత్తూరులో తేలికపాటి వర్షం



చిత్తూరు కల్చరల్, జూలై 5: నగరంలో శుక్రవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. రోడ్లపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పాఠశాలల నుంచి విద్యార్థులు, కార్యాలయాల నుంచి ఉద్యోగులు ఇళ్లకు చేరుకోవడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇదే అదనుగా ఆటోవాలాలు అధిక చార్జీలతో జేబులు నింపుకున్నారు.

టీడీపీ నేతకు మాతృ వియోగం


నివాళులర్పిస్తున్న మునిచంద్రారెడ్డి

వెదురుకుప్పం, జూలై 5: టీడీపీ ఎస్సీ సెల్ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీఎం రవి తల్లి బి.చంద్రమ్మ(65) శుక్రవారం మృతిచెందారు. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన ఆమె మృతితో పలువురు నాయకులు నివాళి అర్పించారు. రవిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునిచంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి చెంగల్రాయరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చక్రి ఉన్నారు.

రెండో రోజూ సినిమా షూటింగ్



గుడిపాల, జూలై 5: మండలంలోని కిలారిపల్లి సమీపంలో గల కుమార్ గ్రానైట్స్‌లో శరీరం అనే తమిళ సినిమా షూటింగ్ రెండవ రోజైన శుక్రవారమూ కొనసాగింది. జీవీబీ సినిమాస్ బ్యానర్‌పై జీవీ పెరుమాళ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో హీరో, విలన్ మధ్య జరిగే ఫైటింగ్ సన్నివేశాన్ని చిత్రీకరించారు.

కుక్కలకు టీకాలు వేయించండి

బంగారుపాళ్యం, జూలై 5: కుక్కల్లో రేబిస్ వ్యాధి రాకుండా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి ప్రాంతీయ పశువైద్యశాలలో ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు (ఏఆర్వీ) వేయనున్నట్లు డాక్టర్ ఆసిఫ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీటీసీని కలిసిన ఎమ్మెల్యే థామస్

చిత్తూరు సిటీ, జూలై 5: గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శుక్రవారం డీటీసీ నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. డీటీసీ కార్యాలయ ఆవరణలోని ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంకెన్నాళ్లీ గేట్ కష్టాలు?

ఏకాంబరకుప్పం రైల్వేగేట్ వద్ద వాహనదారులకు తప్పని అవస్థలు




నగరి, జూలై 5: నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వే గేటు వద్ద వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఒక్కోసారి గేట్ పడితే గంటసేపు నిలుచుకోవాల్సి వస్తోంది. ఉదయం 9, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యలో రైల్వేగేట్ మూసి నట్లయితే విద్యార్థులు, ఆటోవాలాలు, బస్సులు, లారీలు కిలోమీటరు దూరం నిలిచిపోతున్నందున తిప్పలు తప్పడం లేదు. కొన్నేళ్లుగా ఉన్న ఈ సమస్య గురించి పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులను తీసుకురావడం, గేట్ పరిస్థితులను తెలపడం వరకే నాయకులు పరిమితమవుతున్నారని వాహన చోదకులు విమర్శిస్తున్నారు. ఆగస్టు నుంచి మార్చి వరకు ఈ మార్గంలో పళ్లిపట్టులోని సాగర్ చక్కెర కర్మాగారానికి చెరకు తరలించే ట్రాక్టర్లు ఎక్కువవుతున్నాయని, ఆ సమయంలో నరకం చూడాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.